
సాక్షి
తూర్పుగోదావరి

శనివారం । 1 । మార్చి । 2025




వాసవీమాతకు పూజలు

రాజానగరం: రావుల చెరువు గట్టున కొలువు తీరిన వాసవీ కన్యకా పరమేశ్వరికి శుక్రవారం గ్రామ మహిళలు 108 పసుపు కొమ్మలతో అష్టోత్తరం చేసి, కుంకుమార్చనలు నిర్వహించారు.



8,970 క్యూసెక్కుల విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి కాలువలకు 8,970 క్యూసెక్కుల నీరు వదిలారు. తూర్పు డెల్టాకు 2,650, మధ్య డెల్టాకు 1,720, పశ్చిమ డెల్టాకు 4,600 క్యూసెక్కులు వదిలారు.



రంజాన్ వేళలు

	సహర్ ఆదివారం (ఉదయం)	ఇఫ్తార్ ఆదివారం (సాయంత్రం)
రాజమండ్రి	5.01	6.18
కాకినాడ	5.02	6.17
అమలాపురం	4.59	6.18

బాబురే..! కోతల బడ్జెట్



- ఎన్నికల హామీలు గాలికి
- డ్వాక్రా మహిళలకు టోకరా
- అన్నదాత సుఖీభవకు అరకొర విదిలింపు
- ఊసేలేని మహిళలకు ఉచిత బస్సు ప్రస్తావన
- నిరుద్యోగ భృతికి మంగళం
- నిరాశ మిగిల్చిన కూటమి ప్రభుత్వ వార్షిక బడ్జెట్

సాక్షి, రాజమహేంద్రవరం: కూటమి ప్రభుత్వ వార్షిక బడ్జెట్ ప్రజలను దగా చేసేలా ఉంది. అమరావతిలోని శాసనసభలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ శుక్రవారం రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో అన్ని వర్గాలకు అన్యాయం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఇందులో విద్య, వైద్యం, వ్యవసాయం, సంక్షేమం ఇలా అన్ని రంగాలకు తీరని అన్యాయం జరిగింది. కేటాయింపుల్లో కోత విధించి ప్రజలకు మోసం చేశారు. ఇటు వార్షిక, అటు వ్యవసాయ బడ్జెట్‌లో అన్నీ కోతలే విధించారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన 'సూపర్ సిక్స్'కు అవసరమైన మేరకు కేటాయింపులు జరగలేదు. ఇచ్చిన తొలి హామీకే దిక్కులేకుండా పోయింది. అంతేగాక పలు రంగాలకు సగం కంటే తక్కువ నిధులు కేటాయించారు. రైతులు, మహిళలను దారుణంగా మోసం చేశారు. కూటమి ప్రభుత్వం కొలువు దీరింది. ఇచ్చిన హామీలు అమలు చేస్తుందని భావించిన ప్రజలకు నిరాశే ఎదురైంది. కూటమి బడ్జెట్‌పై మేధావులు, రైతు సంఘాల నేతలు పెదవి విరుస్తున్నారు. ఇంత దారుణమైన బడ్జెట్ తాము ఎన్నడూ చూడలేదని నిట్టూరుస్తున్నారు. బడుగు, బలహీన వర్గాల్లో సైతం వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

నిరుద్యోగులకు దగా

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాలు, ప్రతి నిరుద్యోగికీ నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి అందజేస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. తాజాగా ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో నిరుద్యోగుల ప్రస్తావనే లేకుండా వారిని నిట్టనిలువునా మరోసారి మోసం చేశారు. నయా పైసా కూడా కేటాయించకుండా మోసం చేశారు. జిల్లా వ్యాప్తంగా లక్షల మంది నిరుద్యోగులకు అన్యాయం చేశారు.

తల్లికి ద్రోహం

తల్లికి వందనం పేరుతో పాఠశాలకు వెళ్లే ప్రతి విద్యార్థికి రూ.15,000 ఇస్తామన్నారు. ఇందుకు గాను రాష్ట్ర వ్యాప్తంగా రూ.12 వేల కోట్లకు పైగా అవసరమైతే... కేవలం రూ.8,276 కోట్లు మాత్రమే కేటాయించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తామన్న ప్రభుత్వం ఒక ఏడాది ఎగనామం పెట్టింది. తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా సుమారు 1.62 లక్షల మంది విద్యార్థులు పాఠశాలలకు వెళుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రతి ఏటా రూ.243 కోట్లు అందించేవారు. ప్రస్తుత బడ్జెట్ కేటాయింపులను బట్టి చూస్తే పథకంలో భారీగా కోత పడే అవకాశం ఉంది.

మహిళలకు మోసం

మహిళా అభ్యున్నతికి పాటుపడతామని ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చిన చంద్రబాబు బడ్జెట్ కేటాయింపుల్లో దారుణంగా మోసం చేశారు. 19 నుంచి 59 ఏళ్ల మహిళలకు నెలకు రూ.1,500 చొప్పున ఏడాదికి రూ.18,000 ఇస్తామని హామీ ఇచ్చారు. కానీ బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు.

ఉచిత బస్సు ఊసే లేదు

మహిళలకు ఉచిత బస్సు పథకం ప్రస్తావనే లేదు. బడ్జెట్‌లో నయాపైసా నిధులు కేటాయించలేదు. దీంతో పథకం అమలయ్యే అవకాశం కనిపించడం లేదు.

పూర్తిగా వెలగని దీపం

ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని ఈ ఏడాది రెండు సిలిండర్లకు ఎగనామం పెట్టి మోసం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా బడ్జెట్‌లో రూ.4 వేల కోట్లకు గాను రూ.2,601 కోట్లు మాత్రమే కేటాయించారు. దీన్ని బట్టి చూస్తే భారీగా కోత విధించేందుకు పావులు కదుపుతోంది. తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా 3 ప్రధాన కంపెనీలు, 36 ఏజెన్సీల ద్వారా గ్యాస్ సరఫరా జరుగుతోంది. మొత్తం 6,24,265 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో డబుల్ కనెక్షన్లు మినహాయిస్తే 4,09,734 ఉన్నాయి. తెల్లరేషన్ కార్డులు 5,42,964, అంత్యోదయ 21,591 కలిపి మొత్తం 5,64,555 ఉన్నాయి. బడ్జెట్ కేటాయింపులు చూస్తుంటే వీటిలో భారీగా కోత పెట్టే అవకాశం ఉంది. వేలాది మంది మహిళలు కూటమి ప్రభుత్వ తీరును ఎండగడుతున్నారు.

డ్వాక్రా మహిళలకు టోకరా

ఎన్నికల సమయంలో రూ.10 లక్షల వరకు సున్నా వడ్డీ రుణాలు అందజేస్తామని ప్రకటించింది. ప్రస్తుత బడ్జెట్‌లో ఆ ప్రస్తావనే లేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఒక్కో ఏడాదిలో 33,498 గ్రామీణ ప్రాంత స్వయం సహాయక సంఘాలకు రూ.37.27 కోట్లు, పట్టణ ప్రాంతాల్లోని 6,680 సంఘాలకు రూ.8.42 కోట్ల వడ్డీ రాయితీ అందించింది. ప్రస్తుత బడ్జెట్‌ను బట్టి చూస్తే మహిళలకు మోసం తప్పడం లేదు.

రైతులకు పంగనామాలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులకు అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా ఏడాదికి రూ.20 వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేస్తామని హామీలు గుప్పించారు. తాజా బడ్జెట్‌లో మాత్రం అరకొర కేటాయింపులు చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రూ.6 వేలతో కలిపి ఇస్తామంటూ మెలిక పెట్టారు. తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా 1.22 లక్షల రైతు కుటుంబాలున్నాయి. తక్కువ కేటాయింపులతో లబ్ధిదారులకు భారీగా కోత పెట్టేందుకు ప్రభుత్వం కుట్రలు పన్నుతోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి ఏటా రైతు భరోసా పథకం కింద రూ.90.55 కోట్లు చెల్లించేది. ప్రస్తుతం వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో పడింది. కౌలు రైతులకు బడ్జెట్‌లో కేటాయింపులు లేవు.

పర్యాటక రంగానికి నిధులేవీ?

రాజమహేంద్రవరాన్ని టూరిజం హబ్‌గా ప్రకటించలేదు. జిల్లాలో టెంపుల్, ఏకో, కెనాల్ టూరిజం అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఇటీవల మంత్రి దుర్గేష్ ప్రకటించారు. గోదావరి కాలువ, రాజమహేంద్రవరంలోని చారిత్రాత్మక హేవలాక్ బ్రిడ్జి, కడియం నర్సరీలను కలుపుతూ సర్క్యూట్‌గా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నామన్నారు. కానీ బడ్జెట్‌లో మాత్రం ఆ మేరకు పూర్తి స్థాయిలో కేటాయింపులు జరగలేదు.

విద్య, వైద్య రంగాలపై దృష్టేదీ?



కూటమి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో విద్య, వైద్య రంగాలపై దృష్టి కేంద్రీకరించలేదు. ప్రస్తుతం పెరిగే ధరలతో పోలిస్తే ఈ బడ్జెట్‌లో సామాజిక రంగాలకు అన్యాయం జరిగింది. పోలవరం జాతీయ ప్రాజెక్టును మినహాయిస్తే.. వ్యవసాయ రంగానికి కేటాయింపులు సరిగా లేవు. కేంద్ర నుంచి రావాల్సిన నిధుల విషయంలో నోరు మెదపడం లేదు. ఇది రైతు, వ్యవసాయ వ్యతిరేక బడ్జెట్.

– **తాటిపాక మధు**, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు

వాస్తవాల్లేని బడ్జెట్



వెలువరించిన బడ్జెట్లో వాస్తవాలు లేవు. ప్రతిపాదనలు, కేటాయింపులకు విరుద్ధంగా ఉన్నాయి. బీసీలకు 50 ఏళ్లకు పింఛను ఇస్తానని దగా చేశారు. అన్నదాత సుఖీభవకు గతేడాది రూ.4,500 కోట్లు కేటాయించారు. ఎవరికైనా అందిందా? రెండేళ్ల అన్నదాత సుఖీభవకు రూ.21 వేల కోట్లు అవసరమైతే కేటాయించింది మాత్రం రూ.6,300 కోట్లే. మహిళలకు రూ.1,500, విద్యార్థులకు రూ.15,000, రైతులకు రూ.20 వేలు ఇస్తామన్నారు. కేటాయింపులు మాత్రం అరకొరగా ఉన్నాయి. అరాచకం, విధ్వంసం అన్నారు. సూపర్ సిక్స్ పేరుతో ఎన్నికలకు ముందు తెగ హడావుడి చేశారు. అధికారంలో వచ్చాక సక్రమంగా పథకాలు అమలు చేసిన దాఖలాలు లేవు. మాజీ సీఎం వైఎస్ జగన్ క్యాలెండర్ ప్రకటించి మరీ సంక్షేమ పథకాలు ఇచ్చారు.

– **చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ**, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు

న్యూస్‌రీల్

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు శనివారం నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. జిల్లాలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ పరీక్షలు నిర్వహించనున్నారు. ఫస్టియర్ జనరల్ విద్యార్థులు 20,591 మంది , ఒకేషనల్ 2,226 మంది, ద్వితీయ సంవత్సరం జనరల్ 19,228 మంది, ఒకేషనల్ 1875 మంది, మొత్తం 43,754 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. జిల్లాలో 51 కేంద్రాల్లో 20వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. అన్ని కేంద్రాల్లోను సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. విద్యార్థులు పరీక్షకు అరగంట ముందుగా చేరుకోవాలి. పరీక్షల నిర్వహణకు 51 మంది చీఫ్ సూపరింటెండెంట్‌లు, 51 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, 17 మంది అడిషనల్ డీవోలు, 10 మంది కస్టోడియన్లతోపాటు మూడు సిట్టింగ్ స్క్వాడ్‌లు, మూడు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించారు.

పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

పోలీసు అధికారులు, సిబ్బందితో పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్టు ఎస్పీ డి. నరసింహ కిషోర్ తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు పరీక్షా కేంద్రాలలోకి తీసుకువెళ్లకూడదని, పరీక్షా కేంద్రాల చుట్టుపక్కల ఉండే జిరాక్స్ సెంటర్లు మూసి వేయాలన్నారు.

ఫీల్డ్ ఆపరేటర్ల శ్రమను దోచుకుంటున్న ఓఎన్జీసీ


సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అరుణ్



రాజమహేంద్రవరం అసెట్ వద్ద ధర్నా చేస్తున్న జేఏసీ నాయకులు, ఉద్యోగులు

రాజమహేంద్రవరం రూరల్: ఓఎన్జీసీ యాజమాన్యం ఫీల్డ్ ఆపరేటర్ల శ్రమను దోచుకుంటోందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి.అరుణ్ విమర్శించారు. ఫీల్డ్ ఆపరేటర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఓఎన్జీసీ గేటు వద్ద ఉద్యోగులు శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న టి.అరుణ్ మాట్లాడుతూ కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న కార్మికులు తమను పర్మినెంట్ చేయాలని ఆందోళనలు చేశారని అన్నారు. ఈ నేపథ్యంలో నాలుగు సంవత్సరాలకు ఒకసారి రెన్యువల్ విధానాన్ని తీసుకొచ్చి ఉద్యోగ భద్రతను దూరం చేశారని మండిపడ్డారు. కార్మికుల చేత స్కిల్డ్ వర్క్ చేయించుకుని అన్ స్కిల్ వేతనాలు చెల్లిస్తున్నారని తెలిపారు. 2023 నుండి పెండింగ్‌లో ఉన్న పే రివిజన్ తక్షణమే చేయాలని డిమాండ్ చేశారు. మెడికల్ ఓపీడీ అలవెన్స్ రూ.1,000 నుంచి రూ.8,000కు పెంచాలని కోరారు. ఈ ధర్నాకు వి.శ్రీనివాసరావు, చంద్రమౌళి అధ్యక్షత వహించారు. నాయకులు డీఎస్ఆర్‌వీ సుబ్రహ్మణ్యం, అహ్మద్ అలీషా, నాయుడు, జి.చంద్రశేఖర్, గంగాచలం, బి.జయరాజు, రామకృష్ణయ్య పాల్గొన్నారు.

రేషన్ సరకులకు అధిక ధరలు వసూలు చేస్తే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న నాగాంజనేయులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జిల్లాలోని పలు ఎండియూ ఆపరేటర్లు రేషన్ సరకుల డెలివరీ సమయంలో ఎక్కువ ధర వసూలు చేస్తున్నారని, అటువంటివారిపై చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి జిల్లా పౌర సరఫరాల అధికారి ఎం.నాగాంజనేయులు అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం తూర్పుగోదావరి జిల్లాలోని ఎండీయూ ఆపరేటర్‌లతో సమావేశం ఏర్పాటు చేశారు. నాగాంజనేయులు మాట్లాడుతూ ఎండియూ ఆపరేటర్లు వారి పరిధిలో ఉన్న ప్రతి ఇంటికి వెళ్లి రేషన్ సరకులు ఇవ్వాలని ఆదేశించారు. విధిగా తూకం వేసి ఇవ్వాలని, తూకం విషయంలో ఎటువంటి అవకతవకలు లేకుండా రేషన్ సరుకులు సరఫరా చేయాలన్నారు. సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్లు, ఇతర సిబ్బంది, ఎండీయూ ఆపరేటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

రైళ్ల రద్దు

రాజమహేంద్రవరం సిటీ: విజయవాడ డివిజన్‌లోని కడియం, ద్వారపూడి, అనపర్తి రైల్వే స్టేషన్ మధ్య నాన్ ఇంటర్ లాకింగ్ పనులు నిమిత్తం మార్చి 1,2,3 తేదీలలో జిల్లా మీదుగా రాకపోకలు సాగించే గుంటూరు– విశాఖపట్నం –గుంటూరు (17239/17240), విశాఖపట్నం– లింగంపల్లి– విశాఖపట్నం మధ్య నడిచే (12805/12806) రైళ్లను రద్దు చేసినట్టు విజయవాడ డివిజన్ రైల్వే అధికారులు శుక్రవారం ప్రకటించారు. రద్దయిన రైళ్లలో రిజర్వేషన్ పొందిన ప్రయాణికులకు టిక్కెట్ సొమ్ము పూర్తిగా అందజేసేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

ఘనంగా కవిశేఖర ఉమర్ ఆలీషా జయంతి



ఉమర్ ఆలీషా విగ్రహానికి నివాళులర్పిస్తున్న అహ్మద్ ఆలీషా, హుస్సేన్ షా

కాకినాడ రూరల్: పిఠాపురంలోని విశ్వ విజ్ఞాన విద్యాధ్యాత్మిక పీఠం 6వ పీఠాధిపతి బహుముఖ ప్రజ్ఞాశాలి కవిశేఖర డాక్టర్ ఉమర్ ఆలీషా 140వ జయంత్యుత్సవం కాకినాడ సర్పవరం జంక్షన్ బోట్ క్లబ్ వద్ద శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పీఠం కాకినాడ ఆశ్రమ శాఖ ఆధ్వర్యంలో పీఠం కన్వీనరు పేరూరి సూరిబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కవిశేఖర డాక్టర్ ఉమర్ ఆలీషా విగ్రహానికి నవమ పీఠాధిపతి ఉమర్ ఆలీషా సద్గురువు సోదరులు అహ్మద్ ఆలీషా, హుస్సేన్ షా ఘన నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ మహాకవిగా, శతావధానిగా, తత్త్వవేత్త, సంఘ సంస్కర్త, స్వాతంత్ర్య సమరయోధుడిగా, రాజకీయ నాయకుడిగా, పీఠాధిపతిగా డాక్టర్ ఉమర్ ఆలీషా సేవలందించారన్నారు. మాతృ భాష తెలుగు కాకపోయినప్పటికీ తెలుగులో అద్భుతంగా సాహిత్య సంపద సృష్టించారన్నారు. కవిశేఖర ఉమర్ ఆలీషా 1885 ఫిబ్రవరి 28న జన్మించారని, ఆయన జయంతి తమకు పండగ లాంటిదన్నారు. ప్రముఖ పేరడీ గాయకుడు బలరామకృష్ణ తన పాటలతో అలరించారు. ఉమర్ ఆలీషా పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ హుస్సేన్ షా, పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు, రిటైర్డ్ ఆర్టీఓ రామచంద్రరావు, స్థానిక పీఠం కన్వీనర్ యల్లమాంబ, కాకినాడ లక్ష్మి, రెడ్డి సూర్య ప్రభావతి, వనుము మణి, బాదం లక్ష్మికుమారి, వీరభద్రరావు, రెహ్మాన్ కవి శేఖర డాక్టరు ఉమర్ ఆలీషా గురించి వివరించారు.

పంచింది కొంత... పంచుకున్నది ఎంత?

పిఠాపురం: పంచింది రూ.లక్షల్లో అయితే నొక్కేసింది రూ.కోట్లలో ఉండొచ్చని కూటమి నేతల్లో వినిపిస్తున్న గుసగుసలు పిఠాపురంలో హాట్ టాపిక్‌గా మారాయి. గురువారం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా పిఠాపురంలో టీడీపీ నేతలు డబ్బు పంపిణీ చేసిన వైనం రచ్చకెక్కిన సంగతి తెలిసిందే. డబ్బు పంపిణీ పేరుతో పోలింగ్ రోజు వరకు కొందరు నేతలు తమ జేబులు నింపుకున్నారన్న చర్చ జరుగుతోంది. 30 మంది ఓటర్లకు ఒకరు చొప్పున కొందరు చోటా నాయకులను ఎంపిక చేసి ఆయా ఓటర్లను తమ వైపుకు తిప్పుకునేలా చేసినందుకు ఒక్కో చోటా నాయకుడికి రోజుకు రూ.1,000 చొప్పున ముట్టజెప్పిన నేతలు ఆ పేరుతో భారీగా వెనకేసుకున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. గురువారం ఓటర్లకు డబ్బు పంచుతూ టీడీపీ నేత సోషల్ మీడియాకు చిక్కడంతో అసలు పంపిణీ చేసింది ఎంత? ఎంతమందికి ఇవ్వాలని డబ్బు తెచ్చారు? అనే విషయాలపై తీవ్ర చర్చ జరుగుతోంది. మీకు ఖర్చులు ఇస్తాం రండి అంటూ దూర ప్రాంతాల నుంచి ఓటర్లను రప్పించిన కూటమి నేతలు తీరా వారు వచ్చి ఓటు వేశాకా మీరు ఎక్కడి నుంచి వచ్చారో మాకేం తెలుసు అంటూ ఖర్చులు ఇవ్వకుండా తప్పించుకున్నట్లు హైదరాబాద్ నుంచి వచ్చిన ఒక ఓటరు పోలింగ్ కేంద్రం వద్ద వాపోయినట్లు తెలిసింది. వారం రోజుల క్రితమే దూర ప్రాంతాల్లో ఉన్న ఓటర్లను గుర్తించమని వార్డు స్థాయి నేతలను అధినేతలు ఆదేశించారు. ఇదే అదనుగా కొందరు వార్డు స్థాయి నేతలు తమ జేబులు నింపుకున్నారని అంటున్నారు.

కావాలనే వీడియో బయట పెట్టారా?

కేవలం కొందరు నేతలు మాత్రమే డబ్బు పంపిణీ బాధ్యతలు తీసుకుని అరకొరగా పంపిణీ చేసి పెద్ద మొత్తంలో పక్కదోవ పట్టించారని కూటమి వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. పార్టీ అధిష్టానం, పార్టీ అభ్యర్థికి అనుమానం రాకుండా ఉండాలనే కావాలనే డబ్బులు పంచుతున్న వీడియోను బయట పడేలా చేశారనే వాదనలు వినిపిస్తున్నాయి. తక్కువ మందికి పంపిణీ చేసి ఎక్కువ మందికి ఇచ్చినట్టు చూపించడం ద్వారా ఎక్కువ మొత్తం కొట్టేయాలనే ఆలోచనలో భాగంగా కొందరికి పంపిణీ చేసి తాము నిజంగా పంపిణీ చేసినట్లు బయటకు తెలిసేలా చేసిన ఒక ప్రయోగంగా బయటపడిన వీడియో గురించి చెప్పుకుంటున్నారు. ఒక విధంగా టీడీపీ నేత డబ్బు పంపిణీ చేస్తూ దొరికి పోవడం సమాజంలో ఒక గుర్తింపు ఉన్న పట్టభద్రులను అవినీతి పరులుగా సమాజానికి తెలియజేసే విధంగా ఉందన్న ఆరోపణలు ఉన్నాయి. ఇది ఇలా ఉంటే నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహించాల్సిన ఎన్నికల అధికారులు ఇంత బహిరంగంగా డబ్బు పంపిణీ బయటపడినా ఏమి పట్టనట్టుగా వ్యవహరించడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే అంటున్నారు రాజకీయ వేత్తలు.

ఎమ్మెల్సీ స్థానానికి రీ పోలింగ్ నిర్వహించండి

సాక్షి, న్యూఢిల్లీ: ఉభయ తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి రీ పోలింగ్ నిర్వహించాలని బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ ఆంధ్ర ప్రదేశ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొండపల్లి శ్రీనివాస్ కేంద్ర ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేశారు. ఎన్డీఏ (టీడీపీ) కూటమి అభ్యర్థికి గట్టి పోటీ ఇస్తాననే ఉద్దేశంతో అధికార పార్టీకి చెందిన నాయకులతో ఎన్నికల అధికారులు కుమ్మక్కై, తన నామినేషన్‌ను కుట్ర పూరితంగా రిజెక్ట్ చేసి పోటీలో లేకుండా తప్పించారని ఆరోపించారు. శుక్రవారం ఢిల్లీలో శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడారు. ఉభయ తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి తాను స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశానని చెప్పారు. తనకు జరిగిన అన్యాయంపై రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని కలిసి ఈనెల 12 ఫిర్యాదు చేశానని.. అయితే అక్కడ న్యాయం జరగకపోవడంతో 25న కేంద్ర ఎన్నికల సంఘానికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు వివరించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారితోపాటు మిగిలిన అధికారులపై విచారణ జరిపించి తన నామినేషన్‌ను పునరుద్ధరించి ఆమోదించాలని, రీ పోలింగ్ నిర్వహించాలని కోరారు. ఈ విషయంలో తనకు న్యాయం జరిగే వరకూ పోరాడతానన్నారు.

నకిలీ వరి విత్తనాలతో నష్టం



మలకపల్లిలో కంపెనీ ప్రతినిధిని నిర్బంధించి ఆందోళన చేస్తున్న రైతులు

తాళ్లపూడి: కల్తీ వరి విత్తనాల కారణంగా రబీ వరిలో పంట నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు. మండలంలోని మలకపల్లిలో శుక్రవారం గ్రామానికి చెందిన రైతులు స్థానిక రైతు భరోసా కేంద్రం వద్ద కంపెనీ ప్రతినిధులను నిర్బంధించారు. ఈనిక దశలో ఉన్న పంట చేలను వారికి చూపించి సమాధానం చెప్పాలని పట్టుబట్టారు. గ్రామానికి చెందిన మూతిన రాధాకృష్ణ, చెరుకూరి చిన్ని, ఎం అనిల్, మద్దిపాటి రామారావు, ఇమ్మణి సత్యనారాయణ, కొప్పినీడి రాజు, పి సత్యనారాయణ తదితరుల మాట్లాడుతూ ప్రీతి హైబ్రిడ్ సీడ్స్ కంపెనీ విత్తనాలను తాళ్లపూడిలోని దేవీ ఏజన్సీస్ షాపు వద్ద నుంచి కొనుగోలు చేశామన్నారు. గ్రామంలో 300 ఎకరాల్లో రబీలో వరి సాగు చేశామని తెలిపారు. ప్రస్తుతం ఇందులో నాలుగు రకాల విత్తనాలు కేళీలు వచ్చాయని ప్రస్తుతం ఈనిక దశలో ఉందని తెలిపారు. ముందు వెనుక చేను రెల్లు వేస్తోందని అవి కూడా చిన్నగా ఉన్నాయని తెలిపారు. దీంతో దిగుబడి తగ్గిపోతుందని వాపోయారు. తమకు నష్టపరిహారం చెల్లించాలని, అధికారులు, కంపెనీ ప్రతినిధులు సమాధానం చెప్పాలని పట్టుబట్టారు. కంపెనీ ప్రతినిధి హరిష్ మాట్లాడుతూ కేళీ వచ్చినంత మాత్రన నకిలీ విత్తనం కాదని అన్నారు. శాస్త్రవేత్తలు, అధికారులు నిర్ధయించాల్సి ఉంటుందని తెలిపారు. దీనిపై మండల వ్యవసాయాధికారిణి జి రుచిత మాట్లాడుతూ వాటి శాంపిళ్లను సేకరించి పరిశీలిస్తామన్నారు.

సరదాగా వెళ్లి... విగతజీవులై

- రోడ్డు ప్రమాదంలో యువకుల మృతి
- పాత ఇంజరం వద్ద ఘటన





దొమ్మేటి అభినవ్ (ఫైల్) మట్టా ఆకాష్‌రెడ్డి (ఫైల్)

ముమ్మిడివరం/ఐ.పోలవరం: బైక్‌పై సరదాగా వెళ్లిన ఇద్దరు యువకులను గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో అక్కడికక్కడే మృతి చెందారు. ఐ.పోలవరం మండలం పాత ఇంజరం వద్ద గురువారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. ముమ్మిడివరం మండలం బూరుగుపేటకు చెందిన మట్టా ఆకాష్‌రెడ్డి (21), ముమ్మిడివరం టెలిఫోన్ ఎక్ఛ్సేంజ్ వీధికి చెందిన దొమ్మేటి అభినవ్ (17) స్పోర్ట్స్ బైక్‌పై యానాంకు సరదాగా వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్నారు. వీరిని పాత ఇంజరం 216 జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఇద్దరూ సంఘటనా స్థలంలో మృతి చెందారు. స్థానికుల సమాచారం మేరకు మృతదేహాలను ఐ.పోలవరం పోలీసులు ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, ఘటనా స్థలంలో సీసీ కెమెరా పుటేజీ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్లు ఐ.పోలవరం ఎస్సై మల్లిఖార్జున రెడ్డి తెలిపారు.



ఘటనా స్థలంలో మృతదేహాలు

ఒక్కగానొక్క కొడుకు..

ఒక్కగానొక్క కొడుకు అభినవ్ మృతితో ఆ తల్లిదండ్రుల రోధన కంటతడి పెట్టించింది. అల్లారు ముద్దుగా పెంచుకున్నామని, ఇక మాకెవరు దిక్కంటూ దొమ్మేటి అచ్యుత వీరవెంకట సత్యనారాయణ, సరోజినీ దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో దేవుళ్లకు మొక్కితే 14 ఏళ్లకు కొడుకు పుట్టాడని, అల్లారు ముద్దుగా పెంచుకుంటున్నామని వారన్నారు. పదో తరగతి వరకూ చదువుకున్న తమ కుమారుడు స్నేహితులతో కలసి వెళ్లి ఇలా విగతజీవుడవుతాడని అనుకోలేదని ఆ కుటుంబ సభ్యులు అంటున్నారు.

చేతికి అందివచ్చి..

మట్టా రాహుల్, సుభాషిణి దంపతులకు పెద్ద కుమారుడు ఆకాష్‌రెడ్డి. ప్రసుత్తం ముమ్మిడివరంలో డిగ్రీ చదువుతున్నాడు. చేతికంది వచ్చిన కొడుకు మృతితో ఆ కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. స్నేహితులతో సరదాగా తిరిగి వస్తున్నాడనుకున్నామని, ఇలా తిరిగిరాని లోకాలకు వెళ్లిపోతాడని అనుకోలేదని ఆ తల్లిదండ్రులు గుండెలు బాదుకుంటూ రోధించారు.

ఆటల్లో గెలుపు ఓటములు సహజం



పురుషుల విజేత సెంట్రల్ సెక్టార్ జట్టు



మహిళల విజేత ఒడిశా

- భారత మాజీ హాకీ కెప్టెన్ ధనారాజ్ పిళ్ళై
- ముగిసిన ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ పోటీలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఆటల్లో గెలుపు ఓటములు సహజం అని భారత హాకీ మాజీ కెప్టెన్ ధనరాజ్ పిళ్ళై పేర్కొన్నారు. శుక్రవారం కాకినాడ జిల్లా క్రీడామైదానంలో ఆలిండియా సివిల్ సర్వీసెస్ పురుషులు, మహిళల హాకీ పోటీలు ముగిశాయి. ముగింపోత్సవానికి టోర్నమెంట్ చీఫ్ కో–ఆర్డినేటర్, డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా ఒలింపియన్, భారత హాకీ జట్టు కెప్టెన్, ఒలింపియన్, ధనరాజ్ పిళ్ళై, గౌరవ అతిథిగా ఏపీ, తెలంగాణ ఇన్‌కమ్ టాక్స్ డైరెక్టర్ ఆనంద్ రాజేశ్వర్ భాయ్‌వార్ హాజరయ్యారు. ధనరాజ్ మాట్లాడుతూ పోటీలలో విజేతలుగా నిలిచిన సెంట్రల్ సెక్టార్ జట్టు, ఒడిశా జట్టును ఆయన అభినందించారు. ఈ పోటీలలో దేశవ్యాప్తంగా 44 జట్లు పాల్గొన్నాయి. పురుషుల విభాగంలో సెంట్రల్ సెక్టార్ ప్రథమ, హైదరాబాద్ సెక్టార్ ద్వితీయ, హర్యానా తృతీయస్థానాలు, మహిళల విభాగంలో ఒడిశా మొదటి, సెంట్రల్‌సెక్టార్ రెండవ, హర్యానా మూడవ స్థానాలు గెలుచుకున్నాయి. విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు. టోర్నమెంట్ స్పాన్సర్స్‌కు అతిధులు చేతుల మీదుగా మెమెంటోలు ఇచ్చారు. టోర్నమెంట్ కన్వీనర్, సెంట్రల్ సివిల్ సర్వీసెస్ కల్చరల్, స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి రాహుల్ కుమార్, కలెక్టర్ షణ్మోహన్, జేసీ రాహుల్ కుమార్ మీనా, ట్రైనీ కలెక్టర్ భావన, హాకీ సంఘ ప్రతినిధి రవిరాజు, జేఎన్టీయూకే వీసీ ప్రసాద్, జేఎన్టీయూకే స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి శ్యాంకుమార్, కోకనాడ కోస్టల్ స్పోర్ట్స్ వ్యవస్థాపకులు రవిచంద్ర, అంతర్జాతీయ హాకీ క్రీడాకారుడు డి.మురళీకృష్ణ, డీఎస్ఏ కోచ్‌లు పాల్గొన్నారు.